చెరువులు, కాలువల ఆక్రమణ..!

- వర్షా కాలంలో ముంపు బారిన పొలాలు
- ఆందోళనలో అన్నదాతలు



గుడివాడ శివారు ఆక్రమణలకు గురైన పేట గెడ్డ కాలువ



ఆక్రమణలతో ఇరుకుగా మారిన కాలువ



ఆక్రమణల కారణంగా పంట పొలాల మధ్య నిండుగా ప్రవహిస్తున్న కాలువ

ఎస్.రాయవరం: మండలంలో చెరువులు, సాగు నీటి కాలువలు ఆక్రమణకు గురవుతున్నాయి. అవి కుచించుపోయి నీటి నిల్వ సామర్థ్యాన్ని కోల్పోతున్నాయి. ఫలితంగా ప్రతి ఏటా పంట పొలాలు నీట ముంపునకు గురవుతున్నాయని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 24 వేల ఎకరాల ఆయకట్టు పొలాలకు 57 చెరువుల నుంచి, 17 సాగునీటి కాలువల ద్వారా నీరు అందుతోంది. ఇందులో ఎక్కువగా వరి పంటకు సాగునీరు అందగా.. మెరక ప్రాంతంలో కొబ్బరి, అరటి, ఇతర ఆరుతడి పంటలకు కూడా నీరు చేరుతోంది. అయితే ఏడాదికేడాదికి గ్రామాల్లో పంట పొలాలను ఆనుకుని ఉన్న చెరువులు, పంట కాలువలు ఆక్రమణల బారిన పడుతున్నాయి. గుడివాడ శివారులో సాయిమెరైన్, ఇతర ఆక్వా పరిశ్రమలు ఏకంగా పేటగెడ్డ కాలువను ఆక్రమించి విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశాయి. మరో పక్క కాలువ గట్టును చదును చేసి రోడ్డుగా ఉపయోగించుకుంటున్నారు. దీంతో కాలువలో నీరు దిగువకు పోయే ప్రవాహ వేగం తగ్గిపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ కాలువలు నీటి ప్రవాహం సక్రమంగా లేక కొరుప్రోలు, పెదఉప్పలం, గుడివాడ, కొత్త పోలవరం, చిన ఉప్పలం వరి పొలాలు రోజుల తరబడి మునిగి ఉన్నాయి. ఈ సమస్యతో కొందరు రైతులు నాట్లు వేసేందుకు ముందుకు రాలేదు. కొందరు అయితే పూర్తిగా నాట్లు వేయనేలేదు. అదే విధంగా పెదగుమ్ములూరు పెద్ద చెరువు, కొరుప్రోలు పెద్ద చెరువు, కర్రివానిపాలెం రామసాగరం, పేటసూధిపురం పెద్ద చెరువు, పెదఉప్పలం పెద్ద చెరువు ఇప్పటికే వందల ఎకరాల్లో ఆక్రమణలు జరిగి కుదించుకుపోయాయి. వర్షా కాలంలో సక్రమంగా సాగు నీరు ప్రవహించక పొలాలు నీటి ముంపునకు గురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువు గర్భాలు, కాలువల ఆక్రమణలు తొలగించాలని కోరుతున్నారు.

కాలువ గట్టు ఆక్రమించారు



సాయిమెరైన్ పరిశ్రమ ఏర్పాటు సమయంలో కాలువ గట్టును ఆక్రమించారు. మరికొన్ని పరిశ్రమలు కాలువ మధ్యలో నుంచి విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. దీంతో కాలువ మరింత ఇరుకుగా మారింది. వరదల సమయంలో నీటి ప్రవాహం సక్రమంగా ఉండడం లేదు. ఏమాత్రం వర్షం కురిసినా పొలాల్లో నీరు నిలిచిపోతోంది.

– ఎస్. వెంకటరాజు, రైతు, కొత్తపోలవరం

ఫిర్యాదు చేసినా ఫలితం లేదు..



మండలంలో చెరువులు, కాలువ గట్టులు అధిక శాతం ఆక్రమణకు గురయ్యాయి. ఇప్పటికే పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేశాం. అయినా చర్యలు తీసుకోలేదు. రేవుపోలవరం సమీపంలో చెరువుల గట్టు ఎత్తు చేయడం వల్ల నీరు నిల్వ ఉండిపోయి రాకపోకలకు కూడా ఇబ్బంది కలుగుతోంది.

– చోడిపల్లి అప్పన్న, వైస్ ఎంపీపీ, ఎస్.రాయవరం

ఆక్రమణలపై సర్వే చేస్తాం..

చెరువులు, సాగునీటి కాలువలు ఆక్రమణలపై సర్వే చేయిస్తాం. సర్వే నిమిత్తం రెవెన్యూ అధికారులకు లేఖ రాశాం. సర్వే జరిగితో ఏ ప్రాంతంలో ఎంత మేర ఆక్రమణలు గురయ్యాయనే వివరాలు తెలుస్తుంది. గతంలో చేసిన సర్వేలకు సంబంధించి రెవెన్యూ అధికారులు రిపోర్టు ఇవ్వలేదు. ఆక్రమణలు జరిగినట్టు రైతులు పదేపదే తమకు చెబుతున్నారు. సర్వే చేసి చర్యలు తీసుకుంటాం.

– భాను, ఏఈ, నీటి పారుదల శాఖ, ఎస్.రాయవరం మండలం

క్లుప్తంగా

రోడ్డుపై నల్లబుగ్గితో అవస్థలు



నల్ల బూడిదతో బురదగా మారిన జానకయ్యపేట రోడ్డు

నక్కపల్లి: మండలంలో ఉపమాక నుంచి జానకయ్యపేటకు వెళ్లే ప్రధాన రోడ్డుపై జగనన్న కాలనీ సమీపంలో నల్ల బుగ్గి వేయడం వల్ల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వర్షాలు పడిన సమయంలో ఈ బుగ్గి బురద మాదిరిగా తయారై ద్విచక్ర వాహనచోదకులు జారి పడుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. సమీపంలో ఉన్న కంపెనీల నుంచి వ్యర్థ బూడిదను ట్రాక్టర్లపై తెచ్చి ఇలా రోడ్ల పక్కన వేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డు పక్కన వేసిన బూడిదను తొలగించాలని కోరుతున్నారు.

పాయకరావుపేట ఎంపీడీవోగా జయప్రకాష్‌రావు



పాయకరావుపేట: పాయకరావుపేట ఎంపీడీవోగా ఎ.జయప్రకాష్‌రావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు చీడికాడ మండలం ఎంపీడీవోగా పని చేసిన ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేసిన ఎ.సాంబశివరావు కె.కోటపాడు మండలానికి బదిలీ అయ్యారు.

అచ్యుతాపురం మండల సర్వసభ్య సమావేశం నేడు

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం జరగనుందని ఎంపీడీవో కె.ప్రభాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ కోన సంధ్య బుజ్జి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు



వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

యలమంచిలి రూరల్: ఈ నెల 28న జరగనున్న స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ 117వ జయంతిని పురస్కరించుకుని యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో పట్టణానికి చెందిన పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. ఈ నెల 28న విజేతలకు స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరగనున్న భగత్‌సింగ్ జయంతి వేడుకల్లో బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైలపల్లి బాలాజీ, చింతకాయల శివాజీ, కె.మణికంఠ, రవి, గని, రాము, లక్ష్మణ్, దాస్, మహేష్, బాలు పాల్గొన్నారు.

గోవాడ సుగర్స్‌ను ఆదుకోవాలి



చెరకు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసుబాబు

కె.కోటపాడు : ఫ్యాక్టరీ యాజమాన్యం పెరిగిన చెరకు పంట సాగు ఖర్చులను దృష్టిలో ఉంచుకొని మేలైన మద్దతు ధరను ప్రకటించాలని ఏపీ చెరకు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేచలపు కాసుబాబు అన్నారు. కె.కోటపాడులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో ప్రతి ఏటా 5 లక్షల టన్నుల క్రషింగ్‌ను గోవాడ సుగర్ ఫ్యాక్టరీ చేసేదని అన్నారు. ప్రస్తుతం నేడు క్రషింగ్ లక్ష టన్నులకు పరిమితం కావడం చూస్తే సరైన మద్దతు ధర లేక రైతులు సాగుకు నిరాసక్తత చూపుతున్నట్టు అర్థం అవుతుందన్నారు. చెరకు సాగును రైతులు పెంచే విధంగా ఫ్యాక్టరీ నుంచి ఏ విధమైన ప్రోత్సాహం అందడం లేదని కాసుబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా గత ఏడాది ఫ్యాక్టరీకి చెరకును తరలించిన రైతులకు ఉన్న బకాయిలను వెంటనే యాజమాన్యం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామరాజు

నక్కపల్లి: హౌసింగ్ కాలనీల్లో మంజూరైన ఇళ్లకు సంబంధించి పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సీతారామరాజు సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఇళ్లు, మన గౌరవం పేరుతో కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న ఇళ్లను పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. వివిధ శాఖల అధికారులు ఇళ్ల నిర్మాణాలపై దృష్టి సారించి, లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. కాలనీలకు అవసరమైన మౌలిక సదుపాయాలను గుర్తించాలన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన హౌసింగ్ కాలనీలను సందర్శించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగభూషణం, గృహ నిర్మాణ శాఖ ఏఈ జగన్, సీడీపీవో శ్రీవిద్య, ఎంఈవో కుంచం నరేష్, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేస్తే గుర్తింపు



ఎంపీడీవో అప్పలనాయుడును సన్మానిస్తున్న ఎంపీపీ బోదెపు గోవింద్, ప్రజాప్రతినిధులు

యలమంచిలి రూరల్: ప్రభుత్వ ఉద్యోగులు కష్టపడి పనిచేస్తే సమాజంలో గుర్తింపు దానంతటదే వస్తుందని యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, వైస్ ఎంపీపీ రాజాన శేషు అన్నారు. బదిలీపై శ్రీకాకుళం జిల్లాకు వెళుతున్న ఎంపీడీవో కె.అప్పలనాయుడును గురువారం సాయంత్రం మండల పరిషత్ సమావేశ మందిరంలో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనిచేసిన ఏడాదిన్నర కాలంలో ఎంపీడీవో అప్పలనాయుడు ఉద్యోగులు,ప్రజా ప్రతినిధులతో మంచి సంబంధాలను కొనసాగించారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైఎస్సార్‌సీపీ నేత సేనాపతి రాము, ఏవో ప్రసాద్, ఎంఈవో-2 అరుణ్‌కుమార్, మండల ఇంజినీర్ సోమశేఖర్, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన భవానీ కృష్ణ

యలమంచిలి రూరల్: మండలంలోని లక్కవరం సమీపంలో 16వ నంబరు జాతీయ రహదారిపై గురువారం జరిగినప్రమాదంలో కాకినాడ జిల్లా తుని మండలం లోవకొత్తూరుకు చెందిన భవానీ కృష్ణ(45) తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామాల్లో సర్కస్‌లు ప్రదర్శిస్తూ భవానీ కృష్ణ కుటుంబం జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో గురువారం తన స్వగ్రామమైన లోవకొత్తూరు నుంచి యలమంచిలిలో ప్రదర్శన ఇవ్వడానికి వస్తుండగా మార్గం మధ్యలో యలమంచిలి మండలం లక్కవరం వద్ద టీ తాగడానికి భవానీ కృష్ణ ఆగాడు. అనంతరం మూత్ర విసర్జన కోసం రోడ్డు దాటుతుండగా తుని నుంచి అనకాపల్లి వైపు ప్రయాణిస్తున్న బొలేరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భవానీ కృష్ణ తల, శరీర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రథమ చికిత్స నిమిత్తం క్షతగాత్రుడ్ని యలమంచిలి ప్రభుత్వాస్పత్రికి తరలించి, మెరుగైన చికిత్స కోసం తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై యలమంచిలి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా సాధికారతకు పెద్దపీట



మహిళలకు మెగా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్

యలమంచిలి రూరల్: మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. గురువారం యలమంచిలి ధర్మవరం కనకమహాలక్ష్మి ఆలయం వద్ద పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను ఆయన ప్రారంభించారు. అందులో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. అనంతరం 250 పట్టణ స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.19.05 కోట్ల రుణాల మంజూరుకు సంబంధించిన మెగా చెక్కును ఆయన అందజేశారు. మహిళలు ఈ రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ ఎం.సరోజిని, సీఎంఎం డి.పద్మావతి, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, కొటారు సాంబ, కొటారు నరేష్, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు రమణకు నివాళి



రమణ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఎస్.రాయవరం: రేవుపోలవరం మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు చోడిపల్లి రమణ అకాల మరణం పార్టీకి తీరని లోటని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు అన్నారు. రేవుపోలవరం గ్రామంలో గురువారం ఆయన పార్టీ నాయకులతో కలిసి రమణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. రమణ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో రమణ అకాల మరణం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, ఎంపీపీ కోన లోవలక్ష్మి, మండల యూత్ అధ్యక్షుడు నల్లపరాజు వెంకటరాజు, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దేపల్లి బొజ్జన్న, కొరుప్రోలు పీఏసీఎస్ డైరెక్టర్ గుర్రం నానాజీ, పార్టీ నాయకులు చొప్పా రాజు, గరగా శ్రీను, వియ్యపు వరహాలు, చోడిపల్లి కోదండ, వైబోయిన సత్యనారాయణ, వియ్యపు వెంకటరమణ పాల్గొన్నారు.

జీతాలు మంజూరు చేయాలి



ఎంఈవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీఆర్‌ఎంటీలు

గొలుగొండ : రెండు నెలలు నుంచి జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నామని, సమగ్ర శిక్షణ అభియాన్ సొసైటీలో పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలు చెల్లింపుల్లో అధికారులు సరిగ్గా పనిచేయలేదని కోరుతూ గురువారం ఎంఈవో కార్యాలయం వద్ద సీఆర్‌ఎంటీల ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. మండల యూనియన్ నాయకులు రామకృష్ణ, సత్యనారాయణ, నూకరాజు మాట్లాడుతూ రెండు నెలల నుంచి జీతాలు మంజూరు కాక ఇబ్బందులు పడుతున్నామన్నారు. శాశ్వత ఉద్యోగస్తులు వలే ప్రతి నెలా జీతాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థ అభివృద్ధికి కృషి చేస్తున్నామని, అయినా సకాలంలో జీతాలు ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రతి నెలా 1న జీతాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల సమగ్ర శిక్షణలో పనిచేసే సిబ్బంది పాల్గొన్నారు.

మార్చి కల్లా పీఎంఏవై ఇళ్లు పూర్తి చేయాలి

కె.కోటపాడు : పీఎంఏవై రెండో దశ లబ్ధిదారులు మార్చి 25లోగా ఇంటి నిర్మాణాలను పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం హౌసింగ్, పంచాయతీ కార్యదర్శులతో సమావేశంలో ఆమె మాట్లాడారు.ఆవాస్ యోజన పథకంలో రెండో దశలో ఇంటి నిర్మాణ అనుమతులు పొంది నిర్మాణా ల్లో ఉన్న 286 ఇళ్లను పూర్తి చేసేలా చర్యలు తీసు కోవాలన్నారు.

మాకవరపాలెం : గత ప్రభుత్వంలో మంజూరైన గృహాలకు వచ్చే ఏడాది మార్చి వరకే బిల్లులు చెల్లిస్తామని ఇన్‌చార్జ్ ఎంపీడీవో సీతామహాలక్ష్మి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. లింటల్, రూఫ్ లెవెల్‌లో ఉన్న గృహాలను డిసెంబర్‌లోగా, బేస్‌మెంట్‌లో ఉన్న గృహాలను మార్చి నాటికి పూర్తి చేయాలన్నారు.

అధినేతతో ఆత్మీయ భేటీ



వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో గురువారం తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో భేటీ అయిన పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, పాయకరావుపేట, నక్కపల్లి మండలాల అధ్యక్షులు చిక్కాల రామారావు, శీరం నర్సింహమూర్తి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ – నక్కపల్లి/మునగపాక

ఘనంగా మరిడిమాంబ అమ్మవారి పండగ



మునగపాకలో మరిడిమాంబను దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక: మరిడిమాంబ అమ్మవారి పండగ మునగపాకలో గురువారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ చైర్మన్ వేగి కృష్ణ ఏర్పాట్లు చేశారు. పలు నేలవేషాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సిరసపల్లి, ఒంపోలు, తదితర గ్రామాల్లో కూడా అమ్మవార్ల పండగలను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు.

ముత్యాలమ్మ తల్లి పండుగ

అచ్యుతాపురం(మునగపాక): మండలంలోని తిమ్మరాజుపేటలో గురువారం ముత్యాలమ్మ తల్లి పండగ వైభవంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. పలువురు భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

విద్యార్థులకు అభినందన



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో గణపర్తి హెచ్‌ఎం జయలక్ష్మి, పీటీ సత్య శ్రీనివాస్

మునగపాక: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని గణపర్తి జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం జయలక్ష్మి కోరారు. మండల స్థాయిలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ముగింపు గణపర్తి హైస్కూల్‌లో గురువారం జరిగింది. గణపర్తి హైస్కూల్ విద్యార్థులు పలు ఆటల పోటీల్లో పాల్గొని నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో గురువారం సంబంధిత విద్యార్థులను ఆమె అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం ద్వారా ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. విద్యార్థులను తీర్చిదిద్దిన పీటీ సత్యశ్రీనివాస్‌ను కూడా ఆమె అభినందించారు. తమ విద్యార్థులు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర క్రీడల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించడంపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



ఎంపీడీవో ప్రసాద్‌ను కలిసిన ఆదివాసీ యువకులు

అచ్యుతాపురం(మునగపాక): ఆదివాసీ యువత సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచుకోవడానికి ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగియనుంది. లిబ్‌టెక్ ఇండియా, యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్‌టీఐ సంయుక్త నిర్వహణలో యువతకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కోసం ఈ శిబిరం నిర్వహించారు. ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడానికి సమాచార హక్కు చట్టం ఎలా ఉపయోగించాలనే విషయమై లిబ్‌టెక్ ఇండియా ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ భీమరశెట్టి కిషోర్ వివరించారు. దీనిలో భాగంగా మునగపాక ఎంపీడీవో ప్రసాద్‌ను ఆదివాసీ యువకులు కలిసి క్షేత్రస్థాయి సందర్శన చేశారు. అలాగే సమచార హక్కు చట్టం కోసం ప్రభుత్వంతీసుకుంటున్న చర్యలను ఎంపీడీవో వివరించారు. అంబేడ్కరిజమ్ పునాది అసోసియేషన్ కన్వీనర్ రాజాన బుజ్జిబాబు పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమానికి యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్‌టీఐ క్యాంపెయిన్ రాష్ట్ర కో-కన్వీనర్ దాసరి ఇమ్మాన్యుయేల్ రీసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు.

మునగపాకలో భారీ వర్షం



మునగపాకలో కురుస్తున్న వర్షం

మునగపాక: మండల వ్యాప్తంగా గురువారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి వర్షం కురవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. బంగాళాఖాతంలో అల్పపీడనం నేపథ్యంలో పలు చోట్ల వర్షాలు కురిశాయి. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. వాడ్రాపల్లి ఆవ ప్రాంతంలో వరి పైరు ముంపునకు గురైంది. ఈ వర్షం చెరకు తోటలకు మేలు చేకూరుస్తుందని అధికారులు తెలిపారు.

పందూరు గెడ్డలో పేరుకుపోయిన పూడిక



పందూరు గెడ్డలో పేరుకుపోయిన పూడిక

కోటవురట్ల: పందూరు గెడ్డలో భారీగా పూడిక పేరుకుపోయింది. చెత్తతో పాటు పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. పందూరు గ్రామం మధ్యలో నుంచి ఉన్న ఈ గెడ్డ వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ కొండల్లో కురిసిన వర్షం నీరు గెడ్డలోకి చేరుతుంది. ప్రస్తుతం గెడ్డంతా పూడికతో నిండిపోవడంతో వర్షపు నీరు ప్రవహించే పరిస్థితి కనిపించడంలేదు. ఎక్కడికక్కడ తుప్పలు పెరిగిపోవడంతో వర్షపు నీరు గ్రామంలోకి వచ్చే ప్రమాదం ఉంది. దీనికి చెత్త తోడవ్వడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పూడిక తీయించాలని పలువురు కోరుతున్నారు.

ఎన్నికల హామీల అమలుకు కృషి

మునగపాక: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. మండలంలోని గవర్ల అనకాపల్లిలో గురువారం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. సర్పంచ్ దొడ్డి మంగవేణి, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, పార్టీ నేతలు టెక్కలి పరశురామ్, దొడ్డి శ్రీనివాసరావు, దొడ్డి రమేష్, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కశింకోట: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి(35) మృతి చెందినట్లు దువ్వాడ జీఆర్పీ ఎస్ఐ శ్రీలక్ష్మి గురువారం తెలిపారు. చామన ఛాయ రంగు కలిగి సిమెంట్ రంగు ఫుల్ హ్యాండ్ షర్టు, నల్ల రంగు ఫ్యాంటు మృతుడు శరీరంపై ఉన్నాయని, ఇక ఎటువంటి ఆధారాలు లేవన్నారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుని ఆచూకీ కోసం బంధువులు తమ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.